క్లుప్తంగా

శాంతిఖని గనిని సందర్శించిన జీఎం



మైసమ్మ గుడిలో పూజలు చేస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంతిఖని గనిని శుక్రవారం మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి సందర్శించారు. జీఎం (సేఫ్టీ) కార్పొరేట్ కె.గురవయ్యతో కలిసి గనిని సందర్శించిన జీఎం.. ముందుగా గని ఆవరణలో మైసమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం గని భూగర్భంలో దిగి పని స్థలాలను పర్యవేక్షించారు. గనిలో చేపట్టిన రక్షణ చర్యలు పరిశీలించి సూచనలు చేశారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని జీఎం అధికారులకు సూచించారు. గని ప్రాజెక్టు అధికారి ఆర్.విజయ్ ప్రసాద్, గ్రూప్ ఇంజనీర్ బసవరాజు, యాక్టింగ్ మేనేజర్ పి.రాజు, పిట్ ఇంజనీర్ రాంబాబు, ఇతర అధికారులు ఉన్నారు.

సీసీరోడ్లు ప్రారంభం



13వ వార్డులో సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: పట్టణంలోని పలు వార్డుల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే దివాకర్ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు నిర్మిస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ చాత రాజు రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

నెన్నెల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల ఐకేపీ వీవోఏల సంఘం సభ్యులు నెన్నెలలో ఎంపీపీ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. సమ్మె ప్రారంభించి ఐదు రోజులవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు సమ్మయ్య, కార్యదర్శి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, వీవోఏలు గణేశ్, ప్రమీల, పురుషోత్తం, భాగ్య, సంతోశ్, స్రవంతి, నిర్మల, భూమన్న ఉన్నారు.

ప్రతీరోజు వ్యాయామం చేయాలి



మాట్లాడుతున్న లోకనాథ్‌రెడ్డి

శ్రీరాంపూర్: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిరోజు వ్యాయామం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్కే 8 డిస్పెన్సరీలో అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. వైద్యులు వేదవ్యాస్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న రవి

కోటపల్లి: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కావేరి రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ(ఎం) పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాళ్లకు కనీసం ఇంటి స్థలం, ఇళ్లు కేటాయించాలంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. నాయకులు శ్రీనివాస్, చందు, మండల కార్యదర్శి మడే లక్ష్మి, దుర్గం శకుంతల, శంకరక్క, దుర్గక్క , జమున, లక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- ఎక్కడపడితే అక్కడ చెత్త
- ఇష్టారీతిగా కాలువల నిర్మాణం
- బిల్లల, స్లాబ్‌లు వేసి మూసివేత
- పూడిక నిండిన కాలువలు
- దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు



మందమర్రిలోని ఓ రోడ్డు పక్కనే చెత్తాచెదారంలో పందుల స్వైరవిహారం

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో పేరుకుపోయిన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పందుల స్వైరవిహారంతో తీవ్ర దుర్గంధం వస్తోంది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా ఇష్టారీతిగా కాలువల నిర్మాణం, వాటిపై బిల్లలు, స్లాబ్‌లు వేసి మూసివేస్తున్నారు. దీంతో పూడిక నిండి చిన్నపాటి వర్షానికే రోడ్లపై నుంచి ఇళ్లలోకి నీరు చేరడంతో కాలనీవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

సిబ్బంది కొరత

మందమర్రి మున్సిపాలిటీలో సుమారు 60 వేల జనాభా ఉంది. 24 వార్డులకు గాను 6 వార్డులు సింగరేణి పరిధిలో, 18 వార్డులు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కేవలం 33 మంది కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ట్రాలీ డ్రైవర్లుగా 13 మంది, ట్రాక్టర్ డ్రైవర్లుగా ఇద్దరు దానిలో చెత్త తొలగించడానికి ఆరుగురు పని చేస్తుంటారు. మిగిలిన వారితో కాలువల్లో పూడికతీత, రోడ్ల శుభ్రపర్చే పనులు చేయిస్తున్నారు. ఏవైనా ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీల సమావేశాలు, పండుగలు వచ్చాయంటే ఆ పనులకు కార్మికులను వినియోగిస్తారు. ఉన్నవారికే అధిక పనిభారం పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీకి చెత్త సేకరణ కోసం 24 ఆటోలు వచ్చాయి. వాటి వినియోగం లేక అవి మూలనపడ్డాయి. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో 70 నుంచి 80 మంది కార్మికులు ఉండాలి. వారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. వివిధ కాలనీల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ సందర్శించారు. కాలువల్లో పూడికను, ఇష్టారీతిగా కాలువపై ఏర్పాటు చేసుకున్న బిల్లలు, స్లాబ్‌లు తొలగించాలని కోరారు.

ఇళ్లలోకి నీరు వస్తుంది



మందమర్రిలోని మొదటి జోన్‌మార్కెట్ వెనుక కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. ఇళ్లలోని బయటకు వచ్చే వృథా నీరు వెళ్లడానికి గతంలో రోడ్డు కింద నుంచి పైపులతో కాలువ ఉండేది. కొన్నేళ్ల క్రితం ఆ కాలువను తొలగించారు. ఇళ్లల్లోని నీరు బయటకు, వర్షపు నీరు దిగువన ఉన్న ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది.- రసూల్ మొదటి జోన్, మందమర్రి

నివేదించాం

మందమర్రి మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉంది. పారిశుధ్య పనుల నిర్వహణ కోసం 70 నుంచి 80 మంది కార్మికులు కావాలి. ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. వారి నుంచి అనుమతుల రాగానే కార్మికుల నియామక చర్యలు తీసుకుంటాం.

– శ్యాంసుందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మందమర్రి మున్సిపాలిటీ

విజృంభిస్తున్న దోమలు

- డ్రెయినేజీల్లో చెత్తాచెదారం
- కంపు కొడుతున్న కాలనీలు
- జ్వరాల బారిన పడుతున్న జనం



పద్మశాలివాడలో చెత్తతో నిండిన డ్రెయినేజీ

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో దోమలు విజృంభిస్తున్నాయి. కాలనీల్లో డ్రెయినేజీల్లో చెత్తాచెదారంతో పేరుకుపోయి నిండింది. ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. దోమలు వృద్ధి స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు జర్వాల బారిన పడుతున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులు 25,535 జనాభా ఉంది. ప్రధానంగా పద్మశాలివాడ, శివాలయం వీధి, బ్రాహ్మణవాడ, లైన్‌గడ్డ, పుప్పాల హనుమాన్ మందిర్, రజకవాడ, మారెమ్మవాడలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ముక్కుమూసుకుంటున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు కాల్వలకు వెళ్లక నిలిచి ఉంటున్నాయి. అయినా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



డ్రెయినేజీల్లోంచి తీసిన చెత్తను తీసుకుని వెళ్లే ఒక ట్రాక్టర్ చెడిపోయింది. మరమ్మతు చేయించాం. డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తాం. బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్ చెన్నూర్

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న పార్టీశ్రేణులు

నెన్నెల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు బెయిల్ మంజూరై విడుదలవుతున్న సందర్భంగా శుక్రవారం నెన్నెల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా హరీశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను అరెస్ట్ చేసిన న్యాయం, ధర్మమే గెలిచిందన్నారు. భూకబ్జాదారులకు, రాసలీలకు, టీఎస్‌పీఎస్‌పీ పేపర్ లీకేజీలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులను వదిలి సంబంధం లేని వారిని అరెస్ట్ చేయడం సిగ్గు చేటన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం బతకాలంటే కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. సర్పంచ్ తోట సుజాత, బీజేపీ నాయకులు గడ్డం సాంబమూర్తిగౌడ్, పెంటాగౌడ్, కంపెల రాజశేఖర్, మిట్ట కిరణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొక్కలగుట్టలో 'బలగం' ప్రదర్శన



సినిమాను వీక్షిస్తున్న గ్రామస్తులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలో శుక్రవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. గ్రామంలోని హనుమాన్‌గుడి వద్ద భారీ స్క్రీన్ సహాయంతో ప్రదర్శించిన బలగం సినిమాను గ్రామస్తులు వీక్షించారు. ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంది. గ్రామంలోని ఆయా కులసంఘాల సహకారంతో పాటు రైతుబంధు మండల కోఆర్డినేటర్ బలికొండ కిషన్ ఆధ్వర్యంలో సినిమా ప్రదర్శన సాగింది.

కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

మందమర్రిరూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దీనికి నిరసనగా వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో మందమర్రిలోని మార్కెట్ ఏరియాలో శుక్రవారం కాగడాల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్ మాట్లాడారు. బిశ్వాల్ కమిటీ ప్రకారం 1.91 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం సీబీఐకి అప్పగించాలన్నారు. నిరుద్యోగులకు రూ.3016 నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రభుదేవ్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, సాయి, కిశోర్, సత్యవతి తదితరులు ఉన్నారు.

నిరంతర శ్రమతో లక్ష్యం చేరుకోవచ్చు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నస్పూర్: ప్రతిఒక్కరూ తమ జీవితంలో నిరంతరం శ్రమిస్తే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవచ్చునని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సీసీసీలోని నర్సయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సృష్టి ఇనిస్టిట్యూట్ పదో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సృష్టి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రారంభోత్సవ బ్రోచర్‌ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్లు పూదరి కుమార్, వంగ తిరుపతి, గెల్లు రజిత, ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు అంబాల రాజ్‌కుమార్, కట్ల శంకర్, ట్రస్మా నాయకులు రామకృష్ణ, ఉపేందర్, బత్తిని దేవన్న, రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బెల్లంపల్లి: మండలంలోని లంబాడితండా గ్రామంలో శుక్రవారం చలి వేంద్రాన్ని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు కొయ్యల ఏమాజీ ప్రారంభించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, రాష్ట్ర కౌన్సెల్‌సభ్యుడు కేశవరెడ్డి, నాయకులు రాజులాల్ యాదవ్, అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



రామకృష్ణాపూర్‌దైవ సందేశాన్నిస్తున్న చర్చి పాస్టర్



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

రామకృష్ణాపూర్: జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామకృష్ణాపూర్‌లోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో ప్రత్యేక ఆరాధనలు జరిపారు. పాస్టర్ జాషువా దైవసందేశాన్ని అందించారు. 2 వేల ఏళ్ల క్రితం నరావతారిగా ఈ లోకానికి విచ్చేసిన ఏసుక్రీస్తు మానవాళి పట్ల చూపించిన ప్రేమ ఎంతో గొప్పదని అన్నారు. విశ్వ మానవాళి శ్రేయస్సు కోసం క్రీస్తు తన ప్రాణాన్ని త్యాగం చేశాడని అన్నారు. ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ఈ సందర్భంగా ధ్యానించారు.

దండేపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఏసుక్రీస్తు, శిలువ పై నుంచి పలికిన మాటలను ఆయా చర్చిల్లో పాస్టర్లు భక్తులకు చదివి వినిపించారు. దండేపల్లిలో ప్రెస్‌బిటర్ ఇన్‌చార్జి రెవ శీలం వరప్రసాదరావు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ కరుణాకర్ సందేశాన్ని చదివి వినిపించారు.

భీమారం: భీమారంలో క్యాథలిక్ చర్చిలో ప్రార్థనల చేశారు. అనంతరం పాస్టర్‌తోపాటు క్రైస్తవులు ఏసుక్రీస్తు వేషధారణలో ఉన్న వ్యక్తితో శిలువాని ప్రదర్శిస్తూ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

మందమర్రిరూరల్: సీఎస్ఐ చర్చిలో రెవరండ్ జర్మియా క్రీస్తు సందేశాన్ని వినిపించారు. చర్చిపెద్దలు కిశోర్, రవి తదితరులు ఉన్నారు. చర్చి ఆవరణలో బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ మజ్జిగ పంపిణీ చేశారు.



భీమారంలో శిలువాతో ఊరేగింపు



దండేపల్లి: ప్రార్థనలు పాల్గొన్న క్రైస్తవులు



లక్సెట్టిపేట: సీఎస్ఐ చర్చిలో ..



మందమర్రిరూరల్: సీఎస్ఐ చర్చిలో

కుర్చీలు, బీపీ మిషన్ అందజేత

మంచిర్యాలటౌన్: స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి వి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు ఎస్.నాగేందర్ సహకారంతో మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి చేయూతనందించారు. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, రోగులకు అవసరమైన కుర్చీలతోపాటు, బీపీ మిషన్, స్టెతస్కోప్ అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: రాజుగూడ జీపీ పరిధిలోని నాయికపుగూడకు చెందిన కొత్తపెల్లి మల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబాన్ని మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్ శుక్రవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, సర్పంచ్ లచ్చుపటేల్, ఉప సర్పంచ్ రాజం పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన



మాట్లాడుతున్న సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు

బెల్లంపల్లి: బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శనివారం హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి వచ్చిన ప్రధాని సింగరేణిని ప్రైవేటీకరించబోమని ప్రకటించి మాట తప్పారని అన్నారు. కొద్ది రోజుల వ్యవధిలో సింగరేణి కంపెనీకి చెందిన రెండు బ్లాక్‌లు వేలం వేసి ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టారని పేర్కొన్నారు. బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని అన్ని ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసనలు చేపడుతామన్నారు. సీపీఐ శ్రేణులు, ప్రజలు, కార్మికులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు చిప్ప నర్సయ్య, జీసీ మాణిక్యం, ఏఐటీయూసీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు శంకర్, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు

మందమర్రిరూరల్: అన్ని మండల కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఏరియాలోని ఏటీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. దుర్గరాజ్, సుదర్శన్, సత్యనారాయణ, వెంకన్న, రసూల్, లింగయ్య, వెంకటస్వామి, వజ్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజరాజేశ్వరస్వామి కల్యాణం





కోటపల్లి: మండలంలోని జనగామ పంచాయతీ పరిధిలోని శివరాంపల్లి సమీపంలో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రోచ్చరణ మధ్య కల్యాణ తంతు జరిపించారు. జనగామ, శివరాంపల్లి, సుపాక, వెంచపల్లి, ఆలుగామతోపాటు వేమనపల్లి, చెన్నూర్ మండలాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం వారికి అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, సతీశ్, ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల	
జెమిని సినిమా స్క్రీన్ 1:	రావణాసుర/దసరా
జెమిని సినిమా స్క్రీన్ 2:	మీటర్/బలగం
శ్రీనివాస:	సర్
వెంకటేశ్వర:	రావణాసుర
సీసీసీ	
దేవి:	మీటర్
తిరుమల:	రావణాసుర
లక్సెట్టిపేట	
మహానంద:	రావణాసుర
జన్నారం	
రాఘవేంద్ర:	దసరా
బెల్లంపల్లి	
రామకృష్ణ:	రావణాసుర
బాలాజీ:	దసరా
చెన్నూర్	
శ్రీనివాస:	రావణాసుర

– మంచిర్యాలటౌన్

అటెన్షన్ ప్లీజ్ – నిరుపయోగంగా చెత్తరిక్షా



చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాలలో చెత్త రిక్షా నిరుపయోగంగా మారింది. గ్రామ పంచాయతీలకు చెత్తను సేకరించేందుకుగాను ప్రభుత్వం గతంలో రిక్షాలను అందజేసింది. కొన్నిరోజుల వరకు చెత్తరిక్షాలు పని చేశాయి. తర్వాత వాటిని పట్టించుకునే వారు లేక చక్రాలు ఊడిపోయి దర్శనమిస్తున్నాయి. – అధికారి: అజ్మత్ అలీ, ఎంపీవో, చెన్నూర్, సెల్: 90000 13494